# ఎస్టీపీ పనులను ఏకకాలంలో పూర్తి చేయాలి

## ఎస్టీపీ పనులను పరిశీలించిన ఎండీ దానకిశోర్



సిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ ) : తుది దశ నిర్మాణంలో ఉన్న ఎస్టీపీల అన్నీ పనులను ఏకకాలంలో పూర్తి చేయాలని ఎండీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. ఫతేనగర్, మియాపూర్ పటేల్ చెరువు మురుగునీటి శుద్ధి కేంద్రాల్ని మంగళవారం ఆయన సందర్శించారు. మొదటగా ఫతేనగర్ (133 ఎంఎల్‌డీ సామర్థ్యం) ఎస్టీపీని ఎండీ దానకిశోర్ సందర్శించి.. అక్కడ జరుగుతున్న పనులు పరిశీలించారు. ఎస్టీపీ నిర్మాణం తుది దశలో ఉన్నందున ప్రధాన పనులతో పాటు చిన్న పనుల పైనా దృష్టి సారించాలని ఎండీ చెప్పారు. పనులు నిరాటంకంగా జరిగేందుకు అదనపు కార్మికుల బృందాలను సమకూర్చుకోవాలన్నారు. వీరంతా మూడు షిఫ్టుల్లో పని చేసేలా చూడాలని సూచించారు. రాత్రి వేళల్లో పనులు సజావుగా సాగేందుకు లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సివిల్ పనులు, యంత్రాల బిగింపు పనులు సమాంతరంగా చేపట్టాలన్నారు. తర్వాత మియాపూర్ పటేల్ చెరువు (10 ఎంఎల్‌డీ సామర్థ్యం) ఎస్టీపీ వద్దకు వెళ్లి.. రెండు ఎస్టీపీ ప్రాంగణాల్లో అంతర్గత రహదారులు, సుందరీకరణ, పెయింటింగ్ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. పని జరిగే ప్రదేశంలో కార్మికులందరూ తగిన రక్షణ చర్యలు పాటించేలా చూడాలని ఎండీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఈడీ డాక్టర్ ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఎస్టీపీ సీజీఎం రఘు, సుజాత, జీఎంలు, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్నికల బందోబస్తుపై..
# ట్రై కమిషనరేట్ పోలీస్ ఫోకస్

సిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): గణేశ్ నవరాత్రులు, మిలాద్ ఉన్ నబీ పండుగలు ప్రశాంతంగా ముగియడంతో ఇక ట్రై కమిషనరేట్ పోలీసులు ఎన్నికల బందోబస్తుపై దృష్టి పెట్టారు. ఎన్నికల నోటిఫికేషన్ దగ్గరపడుతుండటంతో సిబ్బందిని ఉన్నతాధికారులు సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో భారీగా పోలీసు అధికారుల బదిలీలు జరిగాయి. దీర్ఘకాలికంగా ఒకే కమిషనరేట్‌లో ఉన్న వారిని మరో కమిషనరేట్‌కు బదిలీచేశారు. ఇతర జిల్లాల నుంచి కూడా నగరానికి చాలా మంది బదిలీ అయ్యారు. మూడు కమిషనరేట్ల పరిధిలో ఈ కొత్త టీమ్‌లతో పండుగలను దిగ్విజయంగా పూర్తి చేశారు. తాజాగా.. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు కూడా రాష్ట్రంలో పర్యటిస్తుండటంతో ఎన్నికల మూడ్‌లోకి పోలీసులు వెళ్లిపోయారు. కొత్తగా వచ్చిన పోలీస్ సిబ్బందికి బందోబస్తుపై పూర్తి అవగాహన వచ్చింది. ఎన్నికల సమయంలో ఓల్డ్‌సిటీ కూడా కీలకంగా ఉంటుంది. ఎక్కువ సున్నిత ప్రాంతాలు ఓల్డ్‌సిటీలోనే ఉన్నాయి. దీంతో కొత్త సిటీ కంటే ఓల్డ్‌సిటీలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో సిబ్బందిని ఎక్కువగా కేటాయించాల్సి ఉంటుంది. అయితే, గత ఎన్నికల కంటే ఈ ఏడాది సీసీ కెమెరాల సంఖ్య కూడా భారీగా పెరిగింది. ఈ ఎన్నికలలో భారీగా పోలీసు సిబ్బందితో పాటు సీసీ కెమెరాలను కూడా ఉపయోగించనున్నారు.

### ట్రై కమిషనరేట్లే కీలకం..

హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలోనే అత్యధిక అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. సున్నితం, అతి సున్నితమైన ప్రాంతాలు కూడా ఇక్కడే ఎక్కువగా ఉన్నాయి. ఎన్నికల్లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేలా ట్రై పోలీస్ కమిషనరేట్లలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. రౌడీలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి, బైండోవర్ చేయడాన్ని పోలీసులు మొదలు పెట్టారు. సైబరాబాద్, రాచకొండ పరిధిలో పట్టణ, గ్రామీణ వాతావరణం ఉంటుంది. హైదరాబాద్‌లో పూర్తిగా సిటీ వాతావరణం ఉండగా, పాత బస్తీ కీలకంగా ఉంటుంది. గత ఎన్నికల్లో నమోదైన కేసులు, అప్పట్లో గొడవలు జరిగిన ప్రాంతాలు.. ఇలా 2018లో ఎన్నికల సమయంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయనే విషయాలకు సంబంధించిన పాత రికార్డులను పోలీసులు బయటకు తీశారు. అప్పట్లో గొడవలు జరిగితే వాటికి కారణాలను విశ్లేషిస్తున్నారు.

# లైఫ్ ట్యాక్స్ వసూలులో.. హైదరాబాద్‌దే అగ్రస్థానం

- గ్రేటర్‌లో గత ఆర్థిక సంవత్సరానికి రూ.1740 కోట్లు వసూలు
- ఈసారి ఇప్పటి వరకు 1991 కోట్లు వసూలు
- అందులో 812 కోట్లు నగరం నుంచే

సిటీబ్యూరో, అక్టోబర్ 3 ( నమస్తే తెలంగాణ ) : లైఫ్ ట్యాక్స్ వసూళ్లలో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది. గ్రేటర్‌లో లైఫ్ ట్యాక్స్ వసూళ్లలో గత రెండేండ్లుగా రంగారెడ్డిలో అధికంగా ఉండేది. ఈసారి ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు హైదరాబాద్ రూ.812 కోట్ల వసూలు చేసింది. రాష్ట్రం మొత్తం ఈ ఆర్థిక సంవత్సరానికి (2023- 24) గానూ ఇప్పటి వరకు 1991 కోట్ల లైఫ్ ట్యాక్స్ జమ కాగా, ఇందులో రంగారెడ్డి రూ.610 కోట్లు, మేడ్చల్ రూ.412 కోట్లు ఉంది. రాష్ట్రంలో అత్యధిక లైఫ్ ట్యాక్స్ వసూలైన జిల్లాగా ఇప్పటి వరకు హైదరాబాద్ నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం 2022-2023కు గానూ రూ.1740 కోట్లు వసూలైంది. కాగా, ఈ ఆరు నెలల్లోనే గత ఆర్థిక సంవత్సరానికి మించి లైఫ్ ట్యాక్స్ వసూలు కావడం విశేషం. అత్యధికంగా విలువజేసే వాహనాల వినియోగం కూడా నగరంలోనే ఉండటం కూడా హైదరాబాద్‌కు కలిసి వచ్చింది.

# విదేశీ సీసాలు.. నాసిరకం మద్యం

## ముగ్గురిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

మాదాపూర్, అక్టోబర్ 3: ఈవెంట్‌లో దొరికిన విదేశీ ఖాళీ మద్యం సీసాల్లో చౌకగా లభించే స్థానిక మద్యం నింపి విక్రయిస్తున్న ముగ్గురిని శేరిలింగంపల్లి ఎక్సైజ్ శాఖ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. విదేశీ మద్యం పేరుతో నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో నిఘా పెట్టాం. ఒడిశాకు చెందిన ఎండీ ఆజాం (30) విదేశీ మద్యం బాటిళ్లను బైక్‌పై రవాణా చేస్తూ.. సరఫరా చేస్తున్నాడని తెలిసింది. దీంతో మాదాపూర్‌లోని మెట్రో పిల్లర్ నంబర్ 1724, మెడ్ ప్లస్ మెడికల్ షాప్ వద్ద అతడిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. విచారణలో అతడు మాదాపూర్ సమీపంలో ఉంటున్నట్లు చెప్పాడు. అతడి ఇంట్లో సోదాలు చేయగా 22 విదేశీ మద్యం బాటిళ్లు దొరికాయి. ఇదిలా ఉండగా.. తదుపరి విచారణలో సుశాంత్ మల్లిక్‌తో పాటు అతడి అసిస్టెంట్ సత్యసుందర్ వద్ద పెద్ద మొత్తంలో మద్యం సీసాలు ఉన్నట్లు విచారణలో తేలింది. దీంతో పోలీసులు సుశాంత్ మల్లిక్ (35)తో పాటు సత్యసుందర్ (32) ఇళ్లల్లో కూడా సోదాలు చేసి, 22 విదేశీ మద్యం సీసాలు, 294 ఖాళీ మద్యం సీసాలు, 500 ఖాళీ సీసా క్యాపులు, కవర్లు, లేబుల్స్ స్వాధీనం చేసుకున్నారు. అందులో 46 విదేశీ బాటిళ్లలో సాధారణ మద్యం నింపి.. విక్రయించేందుకు సిద్ధంగా ఉంచారు. 294 ఖాళీ బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ డి. ప్రవీణ్ కుమార్, ఎక్సైజ్ శాఖ ఎస్‌హెచ్‌ఓ, ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్, డీటీఎఫ్ ఎస్సైలు జి.శ్రీకాంత్ రెడ్డి, ఎన్.శ్రీనివాస్‌తో పాటు ఎస్సైలు శ్రీనివాస్, వీరబాబు సిబ్బంది యాదయ్య, ఫక్రుద్దీన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్లలో విద్యుత్ వినియోగ నియంత్రణకు స్మార్ట్ మీటర్లు

## ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్‌తో పొలారిస్ ఒప్పందం



హాస్టల్స్, పొలారిస్ సంస్థల మధ్య స్మార్ట్ మీటర్ ఎంఓయూ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

కొండాపూర్, అక్టోబర్ 3 : హాస్టళ్లలో విద్యుత్ వినియోగ నియంత్రణకు స్మార్ట్ మీటర్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ పొలారిస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం మాదాపూర్‌లోని ఆవాసా హోటల్‌లో జరిగిన సమావేశంలో ఎంఓయూపై హాస్టల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాసం అమర్‌నాథ్‌రెడ్డి, పొలారిస్ స్మార్ట్ మీటరింగ్ ప్రతినిధులు, వ్యవస్థాపకులు, సీఈఓ యష్‌రాజ్ ఖైతాన్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగాన్ని నియంత్రించడంలో స్మార్ట్ మీటర్లు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. వినియోగదారులకు, హాస్టల్స్ నిర్వాహకులకు విద్యుత్ ఆదాతో ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు. ఇది విద్యుత్ చౌర్యం, మీటర్ ట్యాంపరింగ్‌ను అరికడుతుందన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ద్వారా మనకు అవసరమున్నంత విద్యుత్‌ను మాత్రమే వినియోగించగలమన్నారు. వినియోగదారులు సైతం అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ టాటా కరుణాకర్, ట్రెజరర్ మహీధర్, పొలారిస్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ నగేశ్ పట్నాయక్, వెర్టికల్ లీడ్ ప్రజల్ త్యాగి తదితరులు పాల్గొన్నారు.

# ఏనీడెస్క్ లింక్‌ను.. ఓపెన్ చేయకండి

సిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రిసిటీ బిల్లు పెండింగ్‌లో ఉంది.. వెంటనే చెల్లించాలంటూ ఒక రిటైర్డు ఉద్యోగికి మెసేజ్ పంపించిన సైబర్‌నేరగాళ్లు ఆయన బ్యాంకు ఖాతా నుంచి రూ. 10 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జియాగూడకు చెందిన బాధితుడి సెల్‌ఫోన్‌కు ఎలక్ట్రిసిటీ బిల్ డ్యూ ఉన్నదంటూ ఒక మెసేజ్ వచ్చింది. ఆ తర్వాత అతడి వాట్సాప్ నంబర్‌కు ఒక లింక్ పంపించి, దాని ద్వారా మీరు వెంటనే బిల్లు చెల్లించాలంటూ సూచించారు. దీంతో బాధితుడు ఆ లింక్‌ను క్లిక్ చేయగానే ఏనీడెస్క్ యాప్ డౌన్‌లోడ్ అయ్యింది. అందులో ప్యాన్ కార్డు నంబర్, బ్యాంకు వివరాలు పొందు పరచాలని సూచించడంతో.. ఆ వివరాలను పూరించాడు. బాధితుడి బ్యాంకు వివరాలను ఏనీడెస్క్ యాప్ నుంచి సేకరించిన సైబర్‌నేరగాళ్లు అతడి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.10 లక్షలు కొట్టేశారు. ఏనీడెస్క్ లింక్‌ను ఓపెన్ చేయవద్దని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు. బాధితుడి ఫిర్యాదుతో హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# ఓఎల్‌ఎక్స్‌లో ఐ ఫోన్ అమ్ముతామంటూ మోసం

బంజారాహిల్స్, అక్టోబర్ 3: ఓఎల్‌ఎక్స్‌లో ఫోన్ అమ్ముతానని నమ్మించి.. డబ్బులు దోచుకున్న సైబర్ నేరగాళ్లపై బంజారాహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిబౌలిలో నివాసముంటున్న అమీర్‌ఖాన్ ఇటీవల ఓఎల్‌ఎక్స్‌లో ఐఫోన్ 14 ప్రోమ్యాక్స్ కొనడానికి ప్రకటన ఇచ్చాడు. దీంతో సీమాంచల్ రెడ్డి అనే వ్యక్తి పేరుతో మెసేజ్ వచ్చింది. తనవద్ద ఐఫోన్ ఉన్నదని, రూ.60వేలకు విక్రయిస్తానంటూ నమ్మబలికాడు. తన తమ్ముడు బంజారాహిల్స్‌లోని సిటీ సెంటర్ మాల్ వద్దకు వచ్చి ఫోన్ ఇస్తాడని చెప్పాడు. దీంతో అతడి మాటలు నమ్మిన అమీర్‌ఖాన్ రూ.60వేలు యూపీఐ ద్వారా పంపించాడు. అనంతరం సిటీ సెంటర్ మాల్‌వద్దకు వెళ్లిన అమీర్‌ఖాన్ వద్దకు ఓ వ్యక్తి వచ్చాడు. తనవద్ద ఐఫోన్ 14 ప్రోమ్యాక్స్ ఉన్నదని, అమ్ముతానంటూ చెప్పాడు. అతడు సీమాంచల్‌రెడ్డి పంపిన వ్యక్తిగా భావించిన అమీర్ ఖాన్ అతడి వద్ద నుంచి ఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. తనకు ఎవరూ తెలియదని, తాను ఫోన్ అమ్మేందుకు వచ్చానంటూ సదరు వ్యక్తి చెబుతూ.. ఫోన్‌తో సహా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు అమీర్‌ఖాన్ మంగళవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. చీటింగ్‌తో పాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రియుడి ఆత్మహత్య.. యువతి బలవన్మరణం

కొండాపూర్, అక్టోబర్ 3 : ప్రేమ పెళ్లిని కుటుంబ సభ్యులు నిరాకరించడంతో ప్రియుడు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జర్నలిస్ట్ కాలనీలో నివాసముండే బల్విందర్ సింగ్ కూతురు నేహా(19) నానక్‌రాంగూడలోని ఓ బేకరీలో సేల్స్ గర్ల్‌గా పని చేస్తున్నది. అక్కడే పని చేస్తున్న సల్మాన్ అనే యువకుడిని ప్రేమిస్తున్నానని, అతడితో పెండ్లికి ఒప్పుకోవాల్సిందిగా కోరింది. కుటుంబ సభ్యులు పెండ్లికి నిరాకరించడంతో సల్మాన్ తాను నివాసముండే బాలాపూర్ సమీపంలోని వెంకటాపురంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న నేహ మంగళవారం ఉదయం ఇంట్లోని తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. నేహా సోదరి మేఘా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎన్నిసార్లు ఫోన్ చేసినా.. భార్య ఎత్తకపోవడంతో..

## సెల్ఫీ వీడియో తీసుకుని ఉరేసుకున్న భర్త

బంజారాహిల్స్, అక్టోబర్ 3: ఎన్నిసార్లు ఫోన్ చేసినా భార్య ఎత్తకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్ నగర్‌లో నివాసముంటున్న దుబాసి రాజేంద్రప్రసాద్(36) సెక్యూరిటీ గార్డుగా పనిచేశాడు. 15ఏళ్ల కిందట ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. రాజేంద్రప్రసాద్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై.. ఉద్యోగానికి వెళ్లకుండా అవారాగా తిరుగుతున్నాడు. ఇటీవల భార్యతో కూడా విభేదాలు వచ్చాయి. ఇదిలా ఉండగా.. రెండ్రోజుల కిందట బ్యూటీషియన్ పనులపై భర్తకు చెప్పకుండానే ఆమె ఒంగోలు వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు రోజూ మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న రాజేంద్ర ప్రసాద్ పలుమార్లు భార్యకు ఫోన్ చేశాడు. ఆమె ఫోన్ ఎత్తకపోవడంతో తీవ్ర మనస్తాపంతో అతడు సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. 'నీవంటే నాకు ఎంతో ప్రేమ.. నా ఫోన్ కాల్ ఎత్తడం లేదంటే.. ఇక నిన్ను డిస్టర్బ్ చేయవద్దని అనుకుంటున్నా.. అందుకే నేనే వెళ్లిపోతున్నా..' అంటూ వీడియో తీసుకుని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం భర్త ఫోన్ కాల్స్ చూసుకుని కాల్ చేయగా.. అతడు ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసింది. మృతుడి సోదరి స్వరూపారాణి సోమవారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.